
# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగువైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెబుతున్నారు. ఇవన్నీ కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 6 -

## *హీరోచితం*

**విక్రమార్కుడు, బేతాళుడి శవాన్ని** మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రమార్కా! నీకు శ్రమ కలగకుండా ఉండేందుకు మళ్ళీ మరో కథ చెబుతాను, విను.' అని బేతాళుడు ప్రారంభించాడు -

'చాలా సినిమాల్లాగే ఈ చిత్రానికి కూడా ఫారిన్ లొకేషన్స్ ఉండాలనుకున్నారు. డిస్కషన్స్ అయ్యాక కొన్ని పాటలతోబాటు ఫైట్స్ కూడా యుకెలో తీసేద్దాం అనుకున్నారు. కథలు మారనప్పుడు ప్రతి సినిమా కూరకీ పాటలు, డాన్సులు, ఫైట్స్ జోడించిన పోపు సామాను తప్పదు. కూర ఎలాగూ విదేశంలో ఒండుతున్నాం, మొత్తం సినిమా వంట అంతా అక్కడే చేస్తే పోలా - ఆర్టిస్టులకి కార్లు పంపించడాలు, కాల్‌షీట్స్ ఎడ్జస్టు చైడాలూ లేకుండా అందర్నీ ఓ చోట పడేయొచ్చు. ఖర్చులు కలిసొస్తాయి, ఫారిన్ షూటింగ్ మిషతో ఖర్చులు ఎక్కువ చూపించొచ్చు. అంచేత అన్ని విధాలా అంత చిత్రం అవతల దేశంలోనే తీసేద్దాం అని నిర్మాతా, దర్శకుడు నిర్ధారించేసుకున్నారు.

మొత్తం యూనిట్ అంతా లండన్ చేరారు. ఇన్‌డోర్ వర్క్ పైన్‌వుడ్ స్టూడియోలో ఫిక్స్ చేసుకున్నారు.

మొదటిరోజు షూట్ స్టూడియో గార్డెన్స్‌లో. హీరో, హీరోయిన్ ఒకరికొకరు పరిచయమై, వొకర్నొకరు ప్రేమించుకునే సన్నివేశం. ఈ సన్నివేశంలో, హీరోయిన్ పెంపుడు కుక్క హీరోయిన్ కాళ్ళూ చేతులూ నాకుతూ ఉంటుంది. అప్పుడు హీరోగారు ఎంట్రీ ఇస్తారు. కుక్క హీరోని చూసి పరుగుపరుగున వెళ్ళి హీరో చేతులూ, కాళ్ళూ నాకడం ప్రారంభిస్తుంది.

హీరోయిన్, 'జూలీ! కమియర్!' అని తన పెంపుడు కుక్కను పిలుస్తుంది.

'ఫర్వాలేదు. నాకనివ్వండి, ఇట్స్ బ్యూటిఫుల్ డాగ్ యుగాట్ - హాయ్ జూలీ!' అని హీరోయిన్ కుక్క జూలీని హీరో ప్రేమగా నిమురుతాడు.

'నో - మీరెవరో నాకూ తెలియదు. జూలీకి తెలియదు. నాకడానికి వీల్లేదు' - హీరోయిన్.

'పోనీ ముద్దుపెట్టుకోవచ్చా!' - హీరో.

'ఎంత ధైర్యం మీకు? మనం కలిసి అరక్షణం కాలేదు. అప్పుడే ముద్దుదాకా వచ్చారా?' - హీరోయిన్.

'నేను అన్నది మీ జూలీ గురించి.'

'జూలీ ఎప్పుడూ తెలియని మనుషుల దగ్గరకు వెళ్ళదు. ఎందుకో మీకు దగ్గరయింది.'

'అవును కొన్ని బంధాలు దైవ సంకల్పాలు' - హీరో.

'నిజమే - నాకూ అలాగే అనిపిస్తోంది.'

'నీకూ అలాగే అనిపిస్తోందా రాధా!'

'నా పేరు నీకెలా తెలుసు మోహన్?'

'రాధా!'

'మోహన్!'

'రాధా'

- 'మోహన్!' - కట్.

సీనింకా తియ్యలేదు. ఇంకా హీరోగారు రాలేదు. నిర్మాత రెస్ట్‌లెస్ అయిపోతూ అన్నాడు, - 'ఏంటీ లేటు?'

దర్శకుడు 'హీరోగారు ఇంకా రాలేదు. రాగానే మొదలెట్టేద్దామండి!'

'హీరోగాడెక్కడికి పోతాడు. ఆడుకాపోతే ఇంకోడు. ముందా కుక్కషాట్లు తియ్యండి. ఆడొచ్చేలోగా ఈ కుక్క బైటికెల్లి ఏ లారీ కిందేనా పడితే సచ్చేంత సావు' అన్నాడు నిర్మాత.

అప్పుడే వస్తున్న హీరో ఆ మాటలు విని, నిర్మాత దృష్టిలో ఆర్టిస్టు లైఫు కుక్క కంటే హీనం గదా - అనే నిజాన్ని గ్రహించాడు. కానీ ఏవీ అనలేదు. హీరో గొప్ప సహనశీలి.

తర్వాత షూటింగ్ ఇంగ్లండ్ నార్త్ వెస్ట్‌లో సౌత్‌పోర్ట్ బీచ్‌లో పెట్టారు.

ఈ సీన్లో హీరో హీరోయిన్లు ఒకే గుర్రం మీద కూర్చుని ఒకే పాట పంచుకుని పాడుకుంటూ సాగిపోతూ ఉంటారు. అప్పుడు ఒక ఇరవైమంది బికినీలు వేసుకున్న తెల్లమ్మాయిలు, మరో ఇరవైమంది కండలు తిరిగిన నల్లబ్బాయిలు అన్ని సినిమాల్లో మేం ఇలాగే డ్యాన్సులు చేస్తాం అంటూ ఆంగ్ల తెలుగు అంగప్రదర్శన సమిష్టిగా చేస్తారు.

అయితే షూటింగ్ ముందు ఒక ప్రాబ్లమ్ వచ్చింది. గుర్రానికి ఫ్లూ వొచ్చి గుర్రం రాలేదు. బాగా ట్రై చేస్తే ఒక గాడిద దొరికింది.

'గుర్రాన్ని తెమ్మంటే గాడిదని తెచ్చావేంట్రా గాడిదా?' అని ప్రాపర్టీస్ ప్రొవైడర్‌ని అడిగాడు నిర్మాత.

'ఫర్లేదు సార్ - డిజిటల్‌లో మానేజ్ చేసి ఈ గాడిదనే గుర్రంలా చూపిద్దాం సార్' అన్నాడు దర్శకుడు.

సరే - హీరో, హీరోయిన్లను గాడిదెక్కించారు. మీడియా యమా ఫాస్టు కాబట్టి, షూటింగ్‌కి ముందే స్టిల్స్ తీసుకుపోయారు.

ఆంధ్రదేశంలో ఈ హీరోగారి కళాసేవకు గుర్తింపుగా ఆయన్ని గజారోహణ చేయించే కార్యక్రమ ఏర్పాట్లలో ఉన్నారు. షూటింగ్ పూర్తవకుండానే తెలుగు మీడియా అంతా, గజారోహణకు ముందు గాడిద ఎక్కిన హీరో - అని వే ఛానళ్ళ పలికి చూపాయి.

ఇంగ్లండు సౌత్ పోర్ట్ బీచ్‌లో గాడిద మీద కూర్చున్నాక హీరోయిన్ హీరోతో ‘మనకీ గాడిద ఖర్మేవిటండీ! అంది. కానీ హీరో హీరోయిన్ని సముదాయించాడు. ‘పేషన్స్ - సహనం - సహనం వహించు డాళింగ్ - గాడిద మనకి ఇండియాలో లోకువ గానీ ఇక్కడ అడ్డగాడిదలంతా గాడిదను బంగారు లేడిలా భావిస్తారు. మనం నెమలిని ప్రేమిస్తే వీళ్ళు గుడ్లగూబని ఆరాధిస్తారు - అలాగే ఇదీను. ‘

ఎలాగైతేనేం వేషం వేసిన గాడిద, వెయ్యని నిర్మాత, దర్శకుడు, మిగతా ఫిలిం క్రూ ఎవరూ ఓండ్ర పెట్టకుండా షూటింగ్ ముగిసింది.

‘ఈ చిత్రం తర్వాత ఈ హీరోగారు ఎంత బలవంతం చేసినా గజారోహణ చెయ్యలేదు. ఒక్క గజారోహణే కాదు, ఆ తర్వాత ఎన్నో చిత్రాలు చేసినా ఏ చిత్రంలోనూ ఏ జంతువు మీదా అధిరోహించలేదు.

- విక్రమార్కా! ఇప్పుడు చెప్పు కళాకారుడు గొప్ప సహనంతో సహనశీలుడై ఉండాలని నమ్మే మన హీరో మళ్ళీ ఏ జంతువు మీదా ఎందుకు కూర్చోలేదు? ఏ జంతువుతోనూ ఎందుకు నటించలేదు? - నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో, నీకు అర్జంటుగా తల బట్టతలైపోయి, విగ్గు తగిలించుకుని చింపాంజీలా కనబడతావ్.‘ అని బేతాళుడు ముగించాడు.

వెంటనే విక్రమార్కుడిలా బదులిచ్చాడు. ‘ఓ! బేతాళా! - ఇంగ్లండ్‌లో తెలుగు సినిమా షూటింగ్ పూర్తయిన రాత్రి మన హీరో బిబిసీలో మైకేల్‌కేన్ ఇంటర్వ్యూ చూశాడు. ఆ ఇంటర్వ్యూ చూస్తుంటే మన హీరోకి స్వానుభవం గుర్తొచ్చింది. ఒక చిత్రంలో మైఖేల్ కేన్ గాడిద మీద ఎక్కాల్సొచ్చింది. షాట్ స్టార్ట్ అవగానే ఆ గాడిద బెదిరిపోయి మైఖేల్ కేన్‌ని కింద పడేసి ఎటో పారిపోయింది. వెంటనే దర్శకుడు ముందా గాడిదని పట్టుకోండి, గాడిదని పట్టుకోండి అని అరిచాడుట. ‘అదృష్టవశాత్తూ గాడిద హైట్ తక్కువ కావడం వల్ల నాక్కాస్త నడుంనొప్పి చేసింది తప్ప పెద్ద దెబ్బలేం తగల్లేదు. అదే ఏ గుర్రమో, ఏనుగో అయితే నడుం విరిగి పోయేది. నా తొలిచిత్రం "జూ"లో గుర్రం ఎక్కి నటించినా, ఈ గాడిద ఇన్సిడెంట్ తర్వాత మళ్ళీ ఏ చిత్రంలోనూ జంతువు మీద, ఎక్కే సీన్లు ఒప్పుకోలేదు. ముఖ్యంగా నా గురించి పట్టించుకోకుండా, పారిపోయిన గాడిద కోసం ఆ దర్శకుడి ఆరాటం చూశాక, ప్రొడక్షన్, ఆర్టిస్ట్‌కిచ్చే విలువ ఏవిటో అర్థమైంది.‘ అని విశదీకరించాడు మైఖేల్ కేన్.

- అయినా ఇప్పుడు మన తెలుగు చిత్రాల్లో ఈ సమస్యకు తావులేదు. జంతువు కనిపిస్తేనేచాలు జంతు హింస అని సెన్సారు ‘చిత్ర‘హింస చేసేస్తోంది.

ఏమైనా ఆర్టిస్టు ప్రేక్షకుల మనిషి. ఎవరేవన్నా సహనంతో సాగిపోవాలి -

‘యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ!

సమదుఃఖ సుఖంధీరం సో అమృతత్వాయ కల్పతే!!

- సహనమే ధీరుడిని అజేయుణ్ణి చేస్తుంది - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణ భగవానుడు! ‘ అని విక్రమార్కుడు రిప్లీకరించగానే, బేతాళుడు మళ్ళీ ఎగిరి ఏపుగా పెరిగిన చెట్టెక్కేసాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments